# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 08-02-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ సముద్ర భద్రత, రక్షణ, ఉగ్రవాద వ్యతిరేక చర్యల్లో భారత్ - మలేషియా సహకారం మరింత విస్తృతం కానున్నదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు.
- ❖ ఈ సంవత్సరం మార్చి 31లోపు నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలిస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పునరుద్ఘాటించారు.
- ❖ భారత్ - అమెరికా వాణిజ్య ఒప్పందంలో రైతులకు హాని కలిగించే ఏ ఒక్క అంశాన్ని కూడా చేర్చలేదని కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు.
- ❖ భారత్ - అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని దేశంలోని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు పెద్ద వరమని కన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ (CAIT) అభివర్ణించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మలేషియా పర్యటన రెండు దేశాల మధ్య దౌత్య, ఆర్థిక సంబంధాల్లో నూతన అధ్యాయాన్ని లిఖించింది. మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీంతో నరేంద్ర మోదీ ఈరోజు విస్తృతస్థాయిలో చర్చలు జరిపారు. రక్షణ, భద్రత, ఆర్థిక, ఆవిష్కరణ రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని ఇరు దేశాల నేతలు నిర్ణయించారు. ఈ పర్యటనలో భాగంగా విపత్తు నిర్వహణ, ఆడియో విజువల్ కో-ప్రొడక్షన్, అవినీతి నిర్మూలన, సెమీకండక్టర్ల అభివృద్ధి, ఆరోగ్యం, వైద్యం రంగాల్లో సహకారంపై రెండు దేశాలు ఒప్పంద పత్రాలను మార్చుకున్నాయి. ముఖ్యంగా డిజిటల్ చెల్లింపుల కోసం ఎన్‌పీసీఐ (NPCI) ఇంటర్నేషనల్, మలేషియాకు చెందిన పే-నెట్ (PAYNET) మధ్య కీలక ఒప్పందం కుదిరింది. సముద్ర భద్రత, రక్షణ, ఉగ్రవాద వ్యతిరేక చర్యల్లో భారత్-మలేషియా సహకారం మరింత విస్తృతం కానున్నదని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఉగ్రవాదంపై భారత్ వైఖరి దృఢమైనదని, ఇందులో ద్వంద్వ ప్రమాణాలకు తావులేదని పునరుద్ఘాటించారు.

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

సీషెల్స్ అధ్యక్షుడు పాట్రిక్ హెర్మినీ ఐదు రోజుల అధికారిక పర్యటన నిమిత్తం భారత్‌కు విచ్చేశారు. చెన్నై, ముంబయి నగరాల్లో తన పర్యటనను ముగించుకుని ఈరోజు ఆయన దేశ రాజధాని ఢిల్లీకి చేరుకున్నారు. ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి అనుప్రియా పటేల్ ఆయనకు స్వాగతం పలికారు. ఈ పర్యటన ద్వారా ఇరు దేశాల మధ్య రక్షణ, ఆర్థిక, సాంకేతిక రంగాల్లో సహకారం మరింత బలపడుతుందని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సామాజిక మాధ్యమం వేదికగా వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర బడ్జెట్ 2026-27 దేశ ప్రగతిలో కొనసాగింపునకు, స్థిరత్వానికి, సుస్థిర అభివృద్ధికి నిదర్శనమని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ప్రశంసించారు. సిమ్లా పర్యటనలో ఉన్న ఆయన, ఈరోజు బడ్జెట్‌పై మీడియా సమావేశంలో మాట్లాడుతూ... ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో గత 11 ఏళ్లుగా `వికసిత్ భారత్` లక్ష్య సాధన కోసం నిరంతర కృషి జరుగుతోందని పేర్కొన్నారు. ఈ బడ్జెట్ సామాన్యుల ఆకాంక్షలకు ప్రతిరూపమని, దేశ మౌలిక సదుపాయాల కల్పనలో కీలక పాత్ర పోషిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

దేశవ్యాప్తంగా పాఠశాల విద్యార్థులకు తప్పనిసరి బయోమెట్రిక్ అప్‌డేట్ (MBU) ప్రక్రియలో భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (UIDAI) కీలక మైలురాయిని చేరుకుంది. గత ఐదు నెలల కాలంలోనే కోటికి పైగా చిన్నారుల బయోమెట్రిక్ వివరాలను విజయవంతంగా నవీకరించినట్లు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. రాష్ట్రాల విద్యా శాఖల సహకారంతో యూఐడీఏఐ ప్రాంతీయ కార్యాలయాలు అత్యంత వేగంగా ఈ ప్రక్రియను పూర్తి చేశాయి. 7 నుంచి 15 ఏళ్ల లోపు ఉన్న చిన్నారులకు ఈ ఉచిత సేవలు.. ఈ ఏడాది సెప్టెంబర్ 30 వరకు అందుబాటులో ఉంటాయి.

= = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర ప్రత్యక్ష పన్నుల మండలి (CBDT) ఆదాయ పన్ను చట్టం–2025కు సంబంధించిన ప్రతిపాదిత నియమాలు, ఫారాలపై వాటాదారుల నుంచి సూచనలు, సలహాలను ఆహ్వానించింది. గతేడాది ఆగస్టులో రాష్ట్రపతి ఆమోదం పొందిన ఈ కొత్త ఆదాయపు పన్ను చట్టం, ఈ సంవత్సరం ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమల్లోకి రానుంది. ఈ నేపథ్యంలో తుది నోటిఫికేషన్ వెలువడక ముందే పన్ను చెల్లింపుదారులు, నిపుణుల అభిప్రాయాలను తెలుసుకోవాలని కేంద్ర ఆర్థిక శాఖ నిర్ణయించింది. ప్రతిపాదిత నియమ నిబంధనలు, ఫారాల ముసాయిదాను ఆదాయపు పన్ను శాఖ అధికారిక వెబ్‌సైట్ incometaxindia.gov.in లో అందుబాటులో ఉంచారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = =

ఈ ఏడాది మార్చి 31 నాటికి నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలిస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పునరుద్ఘాటించారు. ఛత్తీస్‌గఢ్ పర్యటనలో భాగంగా హోం మంత్రి ఉన్నతాధికారులతో కలిసి నక్సల్ వ్యతిరేక కార్యకలాపాలపై ఈరోజు సమీక్ష నిర్వహించారు. వామపక్ష తీవ్రవాదంపై పోరాటంలో భాగంగా చేపట్టిన చర్యలు సత్ఫలితాలు ఇచ్చాయని సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. భద్రతా వ్యూహాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, మావోయిస్టుల ఆర్థిక మూలాలను దెబ్బతీయడం, లొంగుబాటు పాలసీల వంటివి నక్సలిజంపై పోరాటంలో సత్ఫలితాలు ఇచ్చాయని అమిత్ షా వెల్లడించారు. అనంతరం నవ రాయ్‌పుర్‌లో నిర్వహించిన జాతీయ సదస్సు ముగింపు వేడుకల్లో ఆయన మాట్లాడుతూ.. ఒకప్పుడు వెనుకబడిన రాష్ట్రంగా ఉన్న ఛత్తీస్‌గఢ్, బీజేపీ పాలనలో నేడు అభివృద్ధికి ప్రతీకగా నిలిచిందని పేర్కొంటూ...

(వాయిస్ 32 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

భారత్ - అమెరికా వాణిజ్య ఒప్పందంపై కాంగ్రెస్ పార్టీ చేస్తున్న విమర్శలను కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఖండించారు. భోపాల్‌లో ఈరోజు విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... భారత్-అమెరికా ఒప్పందంలో దేశీయ వ్యవసాయ రంగాన్ని పూర్తిగా పరిరక్షించామని, కీలకమైన వ్యవసాయ ఉత్పత్తులను ఈ ఒప్పందం నుంచి మినహాయించినట్లు తెలిపారు. రైతులకు హాని కలిగించే ఏ ఒక్క అంశాన్ని కూడా ఇందులో చేర్చలేదని పేర్కొన్నారు. జన్యు మార్పిడి (GM) ఉత్పత్తులను భారత్ అనుమతించబోదని కేంద్రమంత్రి పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

భారత్ - అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని దేశంలోని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు (MSME) పెద్ద వరమని కన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ (CAIT) అభివర్ణించింది. ఈ ఒప్పందం భారత్‌ను ప్రపంచ ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దే ప్రయాణంలో కీలక మైలురాయిగా నిలుస్తుందని CAIT ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ఖండేల్వాల్ ఈరోజు ప్రకటనలో పేర్కొన్నారు. ప్రపంచ వేదికపై భారత్ ఒక ఆత్మవిశ్వాసం కలిగిన, పోటీతత్వం ఉన్న, నమ్మకమైన వాణిజ్య భాగస్వామిగా ఎదుగుతోందని ఈ ఒప్పందం నిరూపిస్తోందని కొనియాడారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం కారణంగా భారతీయ రైతులకు నష్టం వాటిల్లుతుందంటూ సోషల్ మీడియాలో ప్రచారం అవుతున్న వీడియోను కేంద్ర ప్రభుత్వం ఖండించింది. ఈ ప్రచారం పూర్తిగా నిరాధారమని, ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉందని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (PIB) ఫ్యాక్ట్ చెక్ యూనిట్ స్పష్టం చేసింది. అయోమయం సృష్టించే ఉద్దేశంతోనే ఈ వీడియోను కృత్రిమ మేధ (AI) సాయంతో రూపొందించినట్లు పీఐబీ గుర్తించింది.

= = = = = = = = = = = = = = = = = = = = =

టీ-20 క్రికెట్ ప్రపంచ కప్‌లో ముంబై లో జరిగిన గ్రూప్ మ్యాచ్‌లో నేపాల్.. ఇంగ్లాండ్ చేతిలో 4 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. 185 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన నేపాల్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 180 పరుగులు చేయగలిగింది. మరోవైపు శ్రీలంకలోని కొలంబో వేదికగా శ్రీలంక, ఐర్లాండ్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. తొలుత బ్యాటింగ్ చేస్తున్న శ్రీలంక 18 ఓవర్లకు 4 వికెట్లు నష్టపోయి 135 పరుగులు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = =

ఉత్తరాఖండ్‌లోని పలు ప్రాంతాల్లో రేపటి వరకు రాత్రి, ఉదయం వేళల్లో అతి దట్టమైన పొగమంచు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (IMD) హెచ్చరించింది. రేపటి నుంచి ఈనెల 11 వరకు జమ్మూ–కాశ్మీర్, లడాఖ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో వర్షాలతో కూడిన మంచు కురిసే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. దేశ వాయువ్య ప్రాంతాల్లో రానున్న రెండు రోజుల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమంగా 2 డిగ్రీల సెల్సియస్ మేర పెరిగే అవకాశం ఉందని వాతావరణ విభాగం పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = =

అస్సాం రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు, ఎంపీ గౌరవ్ గొగోయ్‌కు పాకిస్థాన్‌తో సంబంధాలు ఉన్నాయన్న ఆరోపణలపై ఆ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ వ్యవహారాన్ని తదుపరి విచారణ నిమిత్తం కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు (MHA) బదిలీ చేయాలని నిశ్చయించింది.

= = = = = = = = = = = = = = = = = = = = =

======================